

# కూచిపూడి నృత్య సంగీతం

నృత్య సంగీతం కాసెట్లు అదివరకే కొన్ని విడుదల అయాయి గాని అవన్నీ దాదాపుగా భరతనాట్య సంబంధమైనవే. ప్రత్యేకం కూచిపూడి శైలికి సంబంధించిన సంగీతంతో ఇప్పుడు మంచి కేసెట్ విడుదలైంది. "కూచిపూడి నృత్య సంగీతం" అన్న పేరుతో ఈ సంగీతా లైవ్ కేసెట్ (నం. 6 ఇ.సి.డి.బి. 223, స్టీరియో) మాస్టర్ రికార్డింగ్ కంపెనీ వారు (మద్రాసు) విడుదల చేశారు. అరవై నిమిషాల ఈ కేసెట్‌లో అంశాలు ప్రసిద్ధ నర్తకి స్వప్న సుందరి గానం చేశారు. సంగీత పర్యవేక్షణ ప్రసిద్ధ గాయని శ్రీమతి సరళారావు.

ఈ రోజులలో కూచిపూడి నాట్యం చాలామంది అభ్యసిస్తున్నారు. ఇంట్లో టేప్ వేసుకుని సాధన చేయడానికి నిజానికి చాలా వుపయోగంగా వుంటుంది.

తమిళదేశంలో చాలా మంది నర్తకీమణులు శాస్త్రీయ సంగీతం క్షుణ్ణంగా అభ్యసించిన వారే. పద్మా సుబ్రహ్మణ్యం, రాధా విశ్వనాథన్, అలర్‌మేల్‌వల్లి, చిత్రా విశ్వేశ్వరన్ ఇంకా అనేకులు సంగీత కచేరీ చేయగల సామర్థ్యం కలవారంటే అతిశయోక్తి కాదు. ఇక కీర్తిశేషురాలైన "పద్మభూషణ" బాల సరస్వతి అయితే సంగీత విద్వాంసురాలే.

ఈ విషయంలో ఆంధ్ర నర్తకులు చాలా వెనుకే! వుంటే అతి కొద్ది మంది వుండవచ్చు!! స్వప్న సుందరి తల్లిగారు, ఈ కేసెట్‌కు సంగీత పర్యవేక్షణ చేసిన శ్రీమతి సరళా రావు కొద్ది సంవత్సరాల క్రితం ప్రసిద్ధ రేడియో గాయని గాను, సినిమా గాయనిగాను సంగీత ప్రియులకు పరిచయమే! ఆమె సమర్థురాలైన కంపోజర్ కూడా. బహుశ కుమార్తెకు ఆమే సంగీత శిక్షణ గరపి వుండవచ్చు. స్వప్న సుందరిని చక్కని నర్తకిగానే ఎరుగుదుము గాని ఇంత మంచి గాయని కూడానని ఈ కేసెట్ వినేంత వరకూ తెలియదు. ప్రతి అంశం శాస్త్రీయజ్ఞానంతో పుష్టిగా, స్పష్టంగా, శ్రావ్యంగా గానం చేసిందీమె.

పూర్వ రంగంలో వినాయక స్తుతి శ్లోకం, సంప్రదాయ 'కూచిపూడి' ప్రార్థన-'అంబాపరాకు", శివస్తుతి, గురుస్తుతి, సభాలక్షణం శ్లోకాలు అయిన తరువాత ఆరాణ జతిస్వరం వినిపిస్తుంది. తరువాత "దశరథ పుత్ర " అన్న రామ పట్టాభిషేక శబ్దం (మోహన, ఆదితాళం), ఆనంద భైరవిలో 'శ్రీరామం' అన్న శ్లోకం వినవచ్చు.

మాత్య భూతయ్య రచించిన ప్రసిద్ధ "కృష్ణ శబ్దం" "యదువంశ సుధాంబుధి చంద్రలో ఎవరి ఊహనుబట్టి వారు సంచారి భావాలు కూర్చుకోవడానికి అవకాశముండేటట్టుగా "సామిరారా" అన్న పదం పెక్కుసార్లుగానం చేయబడింది. "దశావతార " అంశం "ముత్సరమున" అన్నది చక్కని రాగమాలికగా పాడింది స్వప్న సుందరి. తరువాత "కస్తూరీ తిలకం" ప్రసిద్ధ శ్లోకం, కళ్యాణి రాగంలో.



చివరి అంశం నారాయణ తీర్థుల వారి 'నీలమేఘ శరీర' అన్నది. నృత్య సాధన చేసే వారికి అమిత సౌకర్యంగా పెక్కు రిపిటిషన్స్ వున్నాయి ఇందులో అంశాలలో అక్కడక్కడ వడిపిన నట్టువాంగ శబ్దాలు కూడా నృత్య సాధకులకు బాగా పనికి వస్తాయి.

కూచిపూడి నృత్యం అభ్యసించేవారికి ఎంతో ప్రయోజనకరమైన కేసెట్ ఇది. ఆర్కెస్ట్రా కూడా చాలా బాగుంది. ముఖ్యంగా బాలశాయి వేణువు పెద్ద 'ఎస్సెట్.'

— "పెమ్మరాజు"

కూచిపూడి నృత్య సంగీతం; సంగీతా లైవ్ కాసెట్ నెం. 6 ఇ.సి.డి.బి. 223 స్టీరియో; మాస్టర్ 85రికార్డింగ్ కంపెనీ, మద్రాస్; గానం: స్వప్న సుందరి; సంగీత పర్యవేక్షణ: సరళారావు; కేసెట్ వ్యవధి: 60 ని॥లు ,, ధర : రు.28/- ●

## గీత్‌మాల క్యాసెట్ గెలుపొందిన కాలమ్ దాటని కథ

## నాయకుడు

"నీకీ ఎన్నికల్లో టికెట్టు కావాలా?"
"అవును"
"నువ్వేం చదివావు?"
"ఏం చదవాలి?"
"రాజ్యాంగం వగైరా -"
"మన కనుకూలంగా 'మార్పు' చేసుకునేవి చదవడమెందుకు?"
"సరే... పార్టీ ఫండ్ కెంతిస్తావ్?"
"మీరుకోరినంత - టికెట్టు రేటెంత?"
"పది లక్షలు"
"బ్లాకా? వైటా?"
"నా దగ్గర వున్నట్టు ఎవరికి తెలీదు కనుక 'బ్లాక్'... ఇప్పుడు పార్టీ ఫండ్ కనుక మీ ఇష్టం..."



"శభాష్"
"........."
"మీ ప్రాంతంలో నీకు పలుకుబడి వుందా?"
"చాలా వుంది"
"ఏం చేస్తుంటావ్"
"నోరెత్తిన వాళ్ళని తంతుంటాను"
"ఇంకా - "
"అవసరమైతే 'శాస్త్రి'ని గల్లంతు చేస్తాను"
"ఇంకా -"
"పోలింగ్ బూతులో ఓట్లు వేయించుకుంటాను"
"ఓట్లని 'కొని' వేయించుకుంటావా?"
"ఓటర్లని 'కొట్టి' వేయించుకుంటాను"
"శభాష్... నిన్ను ఎంపిక చేస్తున్నాను"

- ఆకెళ్ళ శివప్రసాద్

( గమనిక: గుమ్మడి కాయల దొంగంటే భుజాలు తడుముకోవద్దని మనవి)